సాక్షి
నంద్యాల
గురువారం । 27 । మార్చి । 2025



సంగీత విభావరి

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని ఉద్యానవనంలో బుధవారం సంప్రదాయ నృత్యాలు అలరించాయి. ఆలయ పుష్కరిణి వద్ద సంగీత విభావరి నిర్వహించారు.



శ్రీశైలంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్

శ్రీశైలం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్ చాలక్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భగవత్ బుధవారం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. వీహెచ్‌పీ కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.



'స్థానిక' ఖాళీలకు నేడు ఎన్నికలు

స్థానిక సంస్థల్లో (జెడ్పీ, మండల పరిషత్, గ్రామ పంచాయతీ) ఖాళీగా ఉన్న స్థానాలకు గురువారం ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది.

8లో ▸

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:55
ఆదోని	సా॥ 6:34	ఉ॥ 4:52
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 4:54
ఆత్మకూరు	సా॥ 6:31	ఉ॥ 4:49
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:52

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు:

తల్లిదండ్రులను గౌరవించండి. తల్లి పాదాల కింద జన్నత్(స్వర్గం) ఉంచబడింది. ఆ స్వర్గ ద్వారాల్లో తండ్రి ప్రధాన ద్వారం. తల్లిదండ్రులను కష్టపెడితే స్వర్గంలోకి ప్రవేశించడం కష్టతరం.

– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ ప్రవేశానికి పదవ తరగతి చదివిన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గిర్వానీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు https//aprs.apcfss.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 1 వరకు అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగవని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున అకౌంట్స్‌ను క్లోజ్ చేసుకోవాల్సి ఉందని, క్రయవిక్రయాలు చేపట్టలేమని మార్కెట్ యార్డు ట్రేడర్స్ అసోషియేషన్ కోరినందున లావాదేవీలను నిలిపివేస్తున్నామరు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని, కమీషన్ ఏజెంట్లు కూడా సరుకులను తెప్పించరాదని సూచించారు. ఏప్రిల్ 2 నుంచి యథా ప్రకారం క్రయవిక్రయాలు కొనసాగుతాయన్నారు.

ఫ్రూట్ కవర్లతో నాణ్యమైన మామిడి

కర్నూలు(అగ్రికల్చర్): మామిడిలో నాణ్యమైన దిగుబడులను పొందేందుకు ఫ్రూట్‌కవర్లు వినియోగించాలని జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు సూచించారు. ఫ్రూట్‌కవర్లను సబ్సిడీపై అందిస్తామన్నారు. బుధవారం కర్నూ లు ఉద్యానభవన్‌లో మామిడి రైతులకు శిక్షణా, చర్చా కార్యక్రమాన్ని ఉద్యాన శాఖ చేపట్టింది. ముఖ్య అతిథిగా ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధి కారి మాట్లాడుతూ ప్రధానంగా కాపునకు వచ్చే తోటల్లో పాటించవలసిన మెళకువలను వివరించారు. పీడీ ఉమాదేవి మాట్లాడుతూ మామిడిలో సరైన సమయంలో నీరు, ఎరువులను డ్రిప్ ద్వా రా అందిస్తే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఏపీడీ రాజాకృష్ణారెడ్డి, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రా మ్ కో–ఆర్డినేటర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలో భాగంగా గురువారం పోలింగ్ జరుగనుంది. అధ్యక్ష పదవికి బి.మురళీమోహన్, మేరీ సంపత్‌కుమారి, పి.హరినాథ్ చౌదరి.. ప్రధాన కార్యదర్శి పదవికి ఎం.ఆంజనేయులు, వి.కృష్ణమూర్తి, ఎం.వెంకటేశ్వర్లు పోటీలో ఉన్నారు. సహాయ కార్యదర్శి పదవికి బాల సుబ్రమణ్యం, టీకే నాగరాజు, లైబ్రరీ సెక్రటరీ పదవికి చంద్రశేఖర్, సంపత్ బరిలో ఉన్నారు. దాదాపు 856 మంది న్యాయవాదులు ఓటు హక్కును కలిగి ఉన్నారు. కాగా ఉపాధ్యక్షుడిగా త్రివిక్రమ్, కోశాధికారిగా గౌతమ్, క్రీడా కార్యదర్శిగా బెస్త సుధాకర్, మహిళా ప్రతినిధిగా హెచ్‌కే అరుణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

వైద్యులకు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేసే పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. వీరికి బుధవారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం జూమ్ ద్వారా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ శివబాల నాగాంజన్, రేడియాలజీ విభాగం డాక్టర్ రాధికకు పదోన్నతులు కల్పించి కర్నూలులోనే కేటాయించారు. జనరల్ సర్జరీ విభాగం డాక్టర్ విజయబాబును నంద్యాలకు, డాక్టర్ మాధవ కృష్ణను వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేశారు.



ఆసుపత్రిలో కుర్చీలులేక రోగుల ఇబ్బందులు



సోమవారం జిల్లెల్ల ఆసుపత్రిలో వైద్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

పర్యవేక్షణ కొరవడి వైద్యం తడబడి!

- పీహెచ్‌సీల్లో అరకొర వైద్యం
- సమయపాలన పాటించని వైద్యాధికారులు, సిబ్బంది
- జిల్లా ఆసుపత్రిలో మూతపడిన స్కానింగ్ సెంటర్
- అందుబాటులో లేని ఇన్సులిన్ ఇంజక్షన్లు
- మందుల కొరతతో రోగులకు తప్పని తిప్పలు

జ్వరం, జలుబు వచ్చి తీవ్ర అస్వస్థతతో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లినా సరైన వైద్యం అందడం లేదు. కనీసం ఇన్సులిన్ ఇంజక్షన్లు ఇచ్చేవారు కరువయ్యారు. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాడిపట్టి వైద్యం చేసే డాక్టర్లు కనిపించడం లేదు. ఇలా అయితే ప్రాణాలు పోతాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రాష్ట్రంలోని 'కూటమి' ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. నంద్యాల జిల్లాలో 52 పీహెచ్‌సీ, 11 సీహెచ్‌సీ, 16 అర్బన్ హెల్త్‌సెంటర్లు, 2 ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. అలాగే నంద్యాల జిల్లా సర్వజన వైద్యశాల పనిచేస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులను ఈనెల 24, 25 తేదీల్లో 'సాక్షి' బృందం పరిశీలన చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.



నంద్యాల జిల్లా ఆసుపత్రిలో డాక్టర్ల రాకకోసం చూస్తున్న రోగులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

గోస్పాడు: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందాలన్నా ఉద్దేశంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిబ్బంది లేక కొన్నిచోట్ల, ఉన్న సిబ్బంది సరైన సమయానికి రాక మరికొన్ని చోట్ల, సరైన సౌకార్యాలు లేక చాలా చోట్ల పేదప్రజలకు వైద్యం అందడం లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీహెచ్‌సీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉంటుండటంతో కింది స్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది విధులకు ఆలస్యంగా రావడం, త్వరగా వెళ్లడం చేస్తున్నారు. పీహెచ్‌సీలు 24 గంటలు పనిచేయాల్సి ఉండగా చాలా చోట్ల అమలు కావడం లేదు. గతంలో ఇచ్చే అన్ని రకాల మందులు ప్రస్తుతం పీహెచ్‌సీల్లో ఇవ్వడం లేదు. దీంతో రోగులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.



వీల్‌చైర్ లేకపోవడంతో ఎత్తుకెళ్తున్న దృశ్యం

ఇవీ సమస్యలు..

- జిల్లా ఆసుపత్రిలో స్ట్రెచ్చర్లు, వీల్‌చైర్లు అరకొరగా ఉన్నాయి. అలాగే 75 మంది జనరల్ డ్యూటీ అటెండర్లకు గాను 35 మంది మాత్రమే పని చేస్తున్నారు.
- గతంలో 108తో డయాలసిస్ రోగులను నంద్యాల జిల్లా ఆసుపత్రికి తరలించేవారు. ప్రస్తుతం 108 వాహనం రాక అవస్థలు పడుతున్నారు.
- డయాలసిస్ రోగులకు పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో లేవు. బయటికి రాస్తుండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.
- నంద్యాల జిల్లా ఆసుపత్రిలో మంగళవారం ఉదయం ఓపీ సమయానికి సిబ్బంది రాక రోగులు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.
- ప్యాంటాప్రజోల్ మాత్రలు, గ్యాస్ సిరప్‌కు బదులుగా చప్పరించే మాత్రలను అందిస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం



ప్రభుత్వ వైద్య సిబ్బంది నిబద్ధతో విధులు నిర్వహించాలి. ప్రతిరోజు నిర్ణీత సమయం వరకు తప్పనిసరిగా పనిచేయాల్సిందే. నిబంధనల మేరకు ప్రతిరోజు ఫేస్ రికగ్నేషన్‌యాప్ ద్వారా హాజరు వేయాలి. రాత్రి వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు సేవలు చేయాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా, ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటాం.

– వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ, నంద్యాల

ప్రభుత్వ ఆసుపత్రుల్లో తీరు ఇలా..

- గోస్పాడు మండలం జిల్లెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు సేవలు అందించాల్సి ఉంది. గత సోమవారం ఒకరు మాత్రమే ఇక్కడ విధుల్లో ఉన్నారు. మరొక డాక్టరు క్యాంపులో ఉన్నట్లు సిబ్బంది చెప్పారు. ఫార్మాసిస్టు వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో స్టాఫ్ నర్సులు రోగులకు మందులు ఇస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఇన్సులిన్ ఇంజక్షన్, ప్యాంటాప్రజోల్ మాత్రలు రోగులకు అందుబాటులో లేవు.
- నంద్యాల జిల్లా ఆసుపత్రిలో రేడియాలజిస్టుల కొరత ఉంది. ఆసుపత్రిలో ముగ్గురు సీనియర్ రెసిడెంట్‌లు, ఒకరు అసోసియేట్, ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉండాలి. ప్రస్తుతం అందులో ఒక్కరూ కూడా పనిచేసేవారు లేరని స్థానిక వైద్యాధికారులు చెబుతున్నారు. ఆసుపత్రిలో స్కానింగ్ సెంటరు ఉన్నా తెరుచుకోవడం లేదు.
- బనగానపల్లె ఏరియా ఆసుపత్రిలో ఆరు సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఒక డీఎస్‌ఆర్, ఏడు స్టాఫ్‌నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆర్థో, కంటి, ఈఎన్‌టీ విభాగాల్లో పరికాల కొరత ఉంది. ఆసుపత్రిలో గుండె వ్యాధికి సంబంధించి డాక్టర్లు లేరు. ఆసుపత్రిలో వేసవికాలం రోగులకు మంచినీరు అందడం లేదు.
- అవుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎనిమిది డాక్టర్లు ఉండాల్సి ఉండగా మూడు డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనరల్ మెడిసిన్, గైనకాలజీ డాక్టర్లు కొన్ని రోజులుగా విధులకు హాజరు కావడంలేదు. సీబీపీ(కంప్లీట్ బ్లడ్‌ఫిక్చర్) పరికరం నిరుపయోగంగా మారింది.
- కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లెలో పీహెచ్‌సీని అద్దె భవనంలో అరకొర వసతుల మధ్యనే నిర్వహిస్తున్నారు.
- సంజామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరకొర సిబ్బందితోనే వైద్య సేవలందిస్తున్నారు.



వసతులు లేని యాక్లూరులోని సీహెచ్‌సీ

- యాక్లూరు సీహెచ్‌సీలో 30 పడకల ఆసుపత్రి ఉంది. ఇక్కడ 8 మంది వైద్యులకు గాను ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. జనరల్ సర్జన్ ఉన్నత చదువుల నిమిత్తం వెళ్లగా, జనరల్ మెడిసిన్ డాక్టర్ సెలవుల్లో ఉన్నారు. డెంటల్ డాక్టర్, అనస్తీషియా డాక్టర్లతో పాటు ఇద్దరిలో ఫార్మాసిస్టులలో ఒకరు మూడురోజులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన మూడు రోజులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలుస్తోంది. అనస్తీషియా, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌లు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. డాక్టర్లు చెప్పినట్లు ఇక్కడ ఇన్సులిన్ ఇంజక్షన్లు ఇవ్వడం లేదు.

పలికే వారు లేరు



దగ్గు, ఆయాసంతో బాధపడుతూ వైద్యం కోసం నంద్యాల పెద్దాసుపత్రికి వచ్చాను. ఇక్కడ టోకను తీసుకునే దగ్గరి నుంచి డాక్టర్ పరీక్షల వరకు ఒకలా ఉంది. ఎక్స్‌రే కోసం చాలా సేపు నిరీక్షించాను. ఆసుపత్రిలో సక్రమంగా పలికే వారు కూడా లేరు.

– ప్రకాష్‌రెడ్డి, వీరారెడ్డిపల్లె

మందులు లేవు



ఆరోగ్య సమస్యలు వస్తే పట్టణాలకు పరుగులు తీయాల్సిందే. ప్రభుత్వాసుపత్రుల్లో పూర్తి స్థాయిలో మందులు లేవు. బయట కొనుక్కోవాల్సి వస్తోంది. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి.

– చెన్నయ్య, పసురపాడు

'ఇన్సులిన్' ఇవ్వరు



నేను కూలీ పనులతో జీవనం సాగిస్తున్నా. షుగర్ వ్యాధి ఉండటంతో గోస్పాడులోని ఆసుపత్రికి వెళ్తే ఇన్సులిన్ ఇంజక్షన్ ఇవ్వడం లేదు. నంద్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రికి వెళ్తే రెండుకు మించి ఇవ్వడం లేదు. ఒక్కోసారి స్టాక్ లేవనే చెబుతున్నారు.

–శ్రీనివాసులు, ఎం.చింతకుంట్ల

108 రావడం లేదు



మూడేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నా. గతంలో 108 వాహనంలో నంద్యాల జిల్లా ఆసుపత్రికి ఉచితంగా వచ్చేవాళ్లం. నాలుగు నెలలుగా 108 వాహనం రావడం లేదు. కొన్ని రకాల మందులు ఒక్కో సారి బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

–పుల్లయ్య, గోనవరం

ప్రభుత్వ హాస్టళ్ల తనిఖీ

కర్నూలు(అర్బన్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి బుధవారం ప్రభుత్వ హాస్టళ్లను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కర్నూలు కలెక్టరేట్ ఆవరణలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఆనంద నిలయం హాస్టళ్లలోని సౌకర్యాలు, ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. లోపాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న వెంకటశేషాద్రి

28న ఇఫ్తార్ విందు

కర్నూలు(అర్బన్): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఈ నెల 28న సాయంత్రం 6 గంటలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయిదా సబీహా పర్వీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విందుకు మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఎక్స్‌గ్రేషియాకు నమోదు చేసుకోండి

కర్నూలు(అర్బన్): ఈ–శ్రమ్ కార్డు పొందిన అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ప్రమాదవశాత్తూ మృతి చెందినా, పాక్షికంగా లేదా పూర్తిగా అంగవైకల్యానికి గురైనా వారి నామినీలు ఎక్స్‌గ్రేషియా కోసం డీఆర్‌డీఏ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కె.వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఆయన ఈ–శ్రమ్ నమోదు ప్రక్రియలో భాగంగా మాట్లాడుతూ 2022 మార్చి 31 లేదా అంతకుముందు ఈ–శ్రమ్ కార్డు పొందిన అసంఘటిత రంగాల్లోని కార్మికులు ప్రమాదవశాత్తూ మృతి చెందినా, అంగవైకల్యం చెందినా ఒకేసారి ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామన్నారు. మరింత సమాచారం కోసం సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

కొనసా...గుతున్న పింఛన్ల వెరిఫికేషన్

జిల్లాలో దివ్యాంగుల పింఛన్లు 31,002

- ఇప్పటి వరకు 5,665 మాత్రమే పరిశీలన
- మరి కొన్ని నెలల పాటు కొత్త పింఛన్లు లేనట్లే...

కర్నూలు(అగ్రికల్చర్): పింఛన్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియ ఇప్పట్లో ముగిసేలా లేదు. మరికొన్ని నెలల పాటు ఈ ప్రక్రియను కొనసాగించి కొత్త పింఛన్ల ఊసే లేకుండా చేయాలనేది కూటమి ప్రభుత్వ కుట్రగా తెలుస్తోంది. 2024 మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేస్తామని చంద్రబాబునాయుడు ఊరూవాడా తిరిగి ప్రకటించారు. ఈ ప్రకటన లక్షల మందిలో ఆశలు రేకెత్తించినా, ఇప్పుడు రీవెరిఫికేషన్ సాకుతో కొత్త పింఛన్లకు బ్రేకులు వేశారు. ఇప్పటికి పది నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్ల ఊసెత్తని పరిస్థితి. కర్నూలు జిల్లాలో దివ్యాంగుల పింఛన్లు 31,002 ఉన్నాయి. జనవరి నెలలో జిల్లాకో సచివాలయాన్ని ఎంపిక చేసి మొత్తం పింఛన్ల పరిశీలన చేపట్టారు. అదే నెలలో వీల్‌చైర్/బెడ్‌కు పరిమితమైన పింఛన్లను ఇంటింటికీ వెళ్లి పరిశీలన పూర్తిచేశారు. ఫిబ్రవరి నెలలో శారీరక వికలాంగులు, అంధులు, చెవిటి–మూగ పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టింది. తాజాగా మంగళ, బుధ, గురువారాల్లో పింఛన్లను మెడికల్ బోర్డుకు పిలిపించి రీ వెరిఫికేషన్ చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం 5,665 పింఛన్లను మాత్రమే పరిశీలించారు. మిగిలిన వన్నీ పూర్తయ్యాక వితంతు పింఛన్ల పరిశీలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి కొన్ని నెలలు పట్టే అవకాశం ఉండటం చూస్తే ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం ఈ ప్రక్రియను సాగదీస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పింఛను ఉంటుందో లేదోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతుండగా.. కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారోనని అర్హులు కార్యాలయాల చుట్టూ తిరుగుతుండటం గమనార్హం.



దివ్యాంగుల పింఛను లబ్ధిదారుడిని పరిశీలిస్తున్న వైద్య బృందం (ఫైల్)

937 పింఛన్ల కోత

- ఏప్రిల్ నెల పింఛన్లకు రూ.195.31 కోట్లు

ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల కింద ఏప్రిల్ నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాకు రూ.195.31 కోట్లు మంజూరయ్యాయి. మార్చి నెలతో పోలిస్తే ఏప్రిల్ నెలలో 937 పింఛన్లపై కోత పడింది. మార్చి నెలలో 4,53,829 పింఛన్లు ఉండగా.. ఏప్రిల్ నెలలో పింఛన్ల సంఖ్య 4,52,892కు తగ్గింది. చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రతినెలా గుట్టచప్పుడు కాకుండా పింఛన్లలో కోత విధిస్తున్న విషయం తెలిసిందే.



కాళ్లకు కర్రలు కట్టుకుని పాదయాత్ర చేస్తున్న కర్ణాటక భక్తుడు



శ్రీగిరి.. భక్త ఝరి

- నేటి నుంచి ఉగాది మహోత్సవాలు
- ఐదు రోజుల పాటు నిర్వహణ
- ప్రతి రోజు ప్రత్యేక అలంకరణ

శ్రీశైలం టెంపుల్: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం ఓంకార నాదంతో మార్మోగుతోంది. ఇరు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభం కానున్నాయి. అశేష భక్తజనం మధ్య ఐదు రోజుల పాటు మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకోసం దేవస్థాన అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు దేవస్థాన ఈఓ, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు స్వామివారి యాగశాల ప్రవేశం చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు.

30న రథోత్సవం

ఐదు రోజుల పాటు నిర్వహించే ఉగాది మహోత్సవాల్లో ప్రతిరోజు భ్రమరాంబాదేవికి ప్రత్యేక అలంకారం, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు విశేష వాహనసేవ నిర్వహిస్తారు. మొదటిరోజు గురువారం భ్రమరాంబాదేవికి మహాలక్ష్మీ అలంకారం, భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ జరపనున్నారు. ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. 28న మహాదుర్గ అలంకారం, కైలాసవాహన సేవ, 29న మహాసరస్వతి అలంకారం, నందివాహనసేవ, ప్రభోత్సవం, వీరాచార విన్యాసాలు, 30న రమావాణీసేవిత రాజరాజేశ్వరి అలంకారం, పంచాంగ శ్రవణం, రథోత్సవం, 31న భ్రమరాంబాదేవి నిజాలంకరణ, అశ్వవాహనసేవ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు.



శ్రీగిరి వైపు అవ్వ పయనం

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయని డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 130 పరీక్షకేంద్రాలో బుధవారం భౌతికశాస్త్రం పరీక్షక నిర్వహించారని పేర్కొన్నారు. మొత్తం 25,158 మంది విద్యార్థులకు గాను 24,378 మంది హాజరుకాగా 780 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

'యోగా' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ప్రధానమంత్రి యోగా అవార్డులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వచ్చే నెల 11న నిర్వహించే అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 8712622576 ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

పాల కల్తీపై అప్రమత్తంగా ఉండాలి

● ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించిన ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజనీ

కర్నూలు(సెంట్రల్): అనంతపురం జిల్లాలో విపరీతమైన పాల కల్తీ నేపథ్యంలో 26 జిల్లాల్లో 215 పాల శాంపిళ్లను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపి పరీక్షించగా 5 శాంపిళ్లలో కల్తీ జరిగినట్లు తేలినట్లు ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర కమిషనర్ లోకాయుక్తకు నివేదిక సమర్పించారు. 2025 ఫిబ్రవరి 7న ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజనీ ఆదేశాలతో అన్ని జిల్లాల్లో పాల శాంపిళ్లను సేకరించినట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈక్రమంలో పాల కల్తీపై అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని, డెయిరీలు, పాల శీతలీకరణ సెంటర్లు, పాల సరఫరా ఏజెన్సీలపై నిఘా ఉంచి కల్తీ జరగకుండా చర్యలు తీసుకోవాలని లోకాయుక్త సూచిస్తూ కేసును మూసి వేశారు. అయితే కొన్ని మార్గదర్శకాలను పాటించాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో ఖర్చు లేకుండా పరిష్కారాలు

కర్నూలు(సెంట్రల్): శాశ్వత లోక్ అదాలత్ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా సత్వరమే కేసులను పరిష్కరించుకోవచ్చని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివశంకరరెడ్డి, డి.రాజబాబు ప్రజలకు సూచించారు. శాశ్వత లోక్ అదాలత్ తీర్పుపై అప్పీళ్లకు కూడా అవకాశం ఉండదన్నారు. కర్నూలుకు చెందిన టి.తిమ్మప్ప బ్యాంకు బరోడాలోలో పొదుపు చేస్తుండగా 2024 డిసెంబర్ 7న మృతి చెందారు. పొదుపు మొత్తం క్లెయిమ్ రూ.11,29,000. దీనిని అతను తన భార్య ఛాయాదేవిని నామినీగాచూపించారు. కాగా, మృతుడికి కుమారుడు మురళీధర్, కూతురు పుష్పలత ఉంది. తల్లి ఛాయాదేవి, కూతురు పుష్పలత.. మురళీధర్‌కు తెలియకుండా డ్రాచేసేందుకు యత్నించగా.. గమనించిన అతడు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. దీంతో ముగ్గురికి మూడు వాటాలు తీసుకునేలా పరిష్కారం చూడపంతో ఎలాంటి వివాదం లేకుండా కేసు పరిష్కారమైందని శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ తెలిపారు.

పీజీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల


కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో గత ఏడాది ఆగస్టులో నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేశారు. రెగ్యులర్ విద్యార్థులు 295 మంది పరీక్షలకు హాజరు కాగా 278 మంది, అనుబంధ కళాశాలల విద్యార్థులు 145 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 130 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి వర్సిటీ పీజీ కళాశాలల విద్యార్థులు 33 మంది హాజరు కాగా 26 మంది, అనుబంధ కళాశాలల విద్యార్థులు 57 మంది హాజరు కాగా 40 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత కోచింగ్‌కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి బీకే వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలో ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను తమ కార్యాలయంలో ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుకు టెట్‌లో అర్హత పొందిన పత్రంతో పాటు రెండు ఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, నేటివిటీ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను జతపరిచి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయానికి అభ్యర్థులు స్వయంగా వచ్చి అందించాలన్నారు. దరఖాస్తులు అందించేందుకు చివరి తేదీ, కోచింగ్ ప్రారంభ తేదీ, కోచింగ్‌కు కాల వ్యవధి తదితర వివరాలను తగిన సమయంలో అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

'స్థానిక' ఖాళీలకు నేడు ఎన్నికలు!

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖాళీగా నాలుగు స్థానాలు
● వెల్దుర్తి, తుగ్గలి ఎంపీపీలతో పాటు జెడ్పీ, కృష్ణగిరి కోఆప్షన్‌కు ఓటింగ్
● నాలుగు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం నల్లేరుపై నడకే
● ఉదయం 10 గంటల్లోపు జెడ్పీ కోఆప్షన్ సభ్యుని నామినేషన్



కర్నూలు(అర్బన్): జిల్లాలోని స్థానిక సంస్థల్లో (జెడ్పీ, మండల పరిషత్, గ్రామ పంచాయతీ) ఖాళీగా ఉన్న స్థానాలకు గురువారం ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, కృష్ణగిరి మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ షాలీసాహెబ్ మరణించగా, వెల్దుర్తి ఎంపీపీ బి.సరళ, తుగ్గలి ఎంపీపీ ఆదెమ్మ తమ పదవులకు 2024 మార్చి 29న రాజీనామా చేశారు. ఈ నాలుగు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంది. జెడ్పీ కోఆప్షన్ సభ్యుని ఎన్నికకు కలెక్టర్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. నేటి ఉదయం 10 గంటల్లోపు నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, తదుపరి బరిలో ఉన్న జాబితాను ప్రచురిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు జెడ్పీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి కోఆప్షన్ సభ్యున్ని ఎన్నుకుంటారు. జెడ్పీలో మొత్తం చైర్మన్‌తో కలిపి 53 మంది సభ్యులు ఉండగా, ఇద్దరు సభ్యులు మృతి చెందడం, ఒకరు తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ప్రస్తుతం 50 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో నేడు జరగనున్న ఎన్నికకు 50 శాతం కోరం ఉంటే (25 మంది సభ్యులు హాజరైతే) సమావేశంలో కోఆప్షన్ సభ్యున్ని ఎన్నుకుంటారు. ఒకవేళ కోరం లేకపోతే మరుసటి రోజుకు ఎన్నిక వాయిదా పడనుంది. కృష్ణగిరి మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుని ఎన్నిక కూడా ఇదే ప్రకారం నిర్వహించనున్నారు.

ఎంపీపీల ఎన్నిక ఇలా..

తుగ్గలి, వెల్దుర్తి మండల పరిషత్‌ల్లో ఎంపీపీలను ఎన్నుకునేందుకు ముందుగా ఆయా మండలాల్లో ఎంపీటీసీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి చేతులు ఎత్తే పద్ధతిలో ఎంపీపీలను ఎన్నుకుంటారు. ఎన్నిక పూర్తయిన అనంతరం సంబంధిత ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికలకు సంబంధించిన అంశాలన్నింటిని రికార్డు చేస్తారు. కృష్ణగిరికి సెల్యూరు సీఈఓ డా.కే వేణుగోపాల్, వెల్దుర్తికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కే తులసీదేవి, తుగ్గలికి హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్‌కుమార్ ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు.



మెజార్టీ సభ్యులు వైఎస్సార్‌సీపీ వైపే..

ఎన్నికలు జరగనున్న నాలుగు స్థానాల్లోను వైఎస్సార్‌సీపీకి చెందిన అభ్యర్థులు సునాయాసంగా విజయం సాధించనున్నారు. జిల్లా పరిషత్‌లో ప్రస్తుతం ఉన్న 50 మంది జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే కావడంతో కోఆప్షన్ సభ్యుని ఎన్నిక లాంఛనమే. అలాగే కృష్ణగిరి మండల పరిషత్‌లో మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఒకరు మృతి చెందడంతో మిగిలిన 12 స్థానాల్లో ఒకటి టీడీపీ, మిగిలిన 11 స్థానాల్లోను వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలే ఉన్నారు. తుగ్గలిలో 17 మంది ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉన్నారు. వెల్దుర్తిలో ఎంపీటీసీలు17 మంది ఉండగా, ముగ్గురు టీడీపీ, మిగిలిన 14 మంది ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు జరగనున్న నాలుగు స్థానాల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపిక నల్లేరుపై నడకే అనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఐదు ఉప సర్పంచ స్థానాలకు కూడా ..

జిల్లాలోని దేవనకొండ మండలం వెలమకూరు, ఓర్వకల్లు మండలం గుట్టపాడు, ఆలూరు మండలం మొలగవెళ్లి, కర్నూలు మండలం సుంకేసుల, వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీల్లో కూడా ఉప సర్పంచు స్థానాలకు ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జీ భాస్కర్ తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ఈ ఎన్నికలను నిబంధనల మేరకు నిర్వహించేందుకు ఈఓఆర్‌డీలకు బాధ్యతలు అప్పగించామన్నారు. అన్ని ప్రాంతాల్లో కూడా వీడియోగ్రఫీ తీయించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ భద్రత కల్పించాలని జిల్లా ఎస్పీని కోరామన్నారు. ఉదయం 9 గంటల నుంచి ఎన్నికల ప్రకియ ప్రారంభమవుతుందన్నారు.

నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదలైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు చెప్పారు.

ఎంపికైన విద్యార్థుల రోల్ నంబర్లు

జె1039000	జె1039066	జె1039132	
ఎం1039251	కె1040090	ఎం1042489	
జె1043148	ఎస్1037851	ఎస్1039074	
ఎస్1039084	ఎస్1039759	ఎస్1040087	
కె1037864	కె.1040037	కె1040260	
కె1041183	బి1038057	జె1041161	
ఏ1042420	ఎల్1038158	జె1037611	
కె1037638	ఐ1037681	ఐ1037719	
జె1038305	జె1038476	ఎం1038503	
ఎం1038712	ఎం1038915	ఎం1039407	
ఐ1039551	ఐ1039788	జె1039815	జె1039906
ఎం1039918	ఎం1040199	జె1040259	
జె1041242	కె1041313	ఎం1041395	
ఐ1041594	జె1041997	జె1042003	జె1042067
ఎస్1042171	జె1042442,	జె1043103	
జె1043262	ఎస్1037613	ఎస్1038853	
జె1038878	ఎస్1038986	జె1039055	జె1039104
జె1039881	జె1039805	జె1039896	జె1039969
ఎస్1040065	ఎస్1040316	జె1041434	
ఎస్1042023	ఎస్1042753	ఎస్1043042	
కె1037445	కె1037644	కె1038239	కె1038893
కె1039051	ఓ1040104	కె1040352	కె1042023
ఓ1042037	ఓ1042414	పీ1038614	
ఎల్1038634	ఎల్1038822	ఎల్1039985	
ఎల్1041325			

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏపీ రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం విమర్శించారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఏపీ రైతుసంఘం జిల్లా కార్యవర్గ సమావేవంలో వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని మోసం చేశాయన్నారు. అన్నదాతలు పంటలు పండక అప్పులు పాలయ్యారని, అయినా బీమాను వర్తింపజేయడంలేదన్నారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 4న కర్నూలులో నిర్వహించనున్న జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని, అందులో రైతుల సమస్యలపై కూలంకషంగా చర్చించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పాల్గొన్నారు.

వలస కూలీల ఇంట్లో భారీ చోరీ

● 60 తులాల వెండి, 2 తులాల బంగారం నగలు అపహరణ


బీరువా తలుపులు పగలకొట్టిన దృశ్యం

కోసిగి: పిల్లలతో కలిసి గుంటూరుకు వలస వెళ్లిన దళితుల ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఈ విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 60 తులాల వెండి, 2 తులాల బంగారం నగలు అపహరణ చేశారని బాధితులు తెలిపారు. కోసిగి మండలం కందుకూరు గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన కమలమ్మ, ఆనంద్ దంపతులు ఇంటికి తాళాలు వేసి పిల్లలతో కలిసి జనవరి 19న గుంటూరుకు వలస వెళ్లారు. ప్రభుత్వం ఎస్సీలకు సబ్సిడీపై సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఇస్తుండటంతో కరెంట్ బిల్లు ఇవ్వాలని తమ్ముడికి ఆనంద్ ఈనెల 16న ఫోన్ చేసి చెప్పారు. ఇంటి వద్దకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు తేలింది. విషయం తెలిసిన వెంటనే బాధితులు గుంటూరు నుంచి కందుకూరు గ్రామానికి వచ్చారు. బీరువా పగులగొట్టి అందులో ఉన్న 60 తులాలు వెండి, 2 తులాల బంగారు నగలు, గత ప్రభుత్వం విద్యార్థినికి ఇచ్చిన ట్యాబ్, పొలం పత్రాలు అపహరించుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. పోలీసులకు సమాచారం ఇచ్చామని, అనుమానితుల పేర్లు సైతం ఇచ్చామని తెలిపారు.

ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గం

● జిల్లా చైర్మన్‌గా సేవలాల్ నాయక్


ఫ్యాప్టో జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు


సేవలాల్ నాయక్, జి.భాస్కర్

కర్నూలు సిటీ: ఫ్యాప్టో (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) జిల్లా నూతన కార్యవర్గాన్ని (2025–27 సంవత్సరాలకు) బుధవారం ఎన్నుకున్నారు. కర్నూలులోని సలాంఖాన్ భవనంలో ఫ్యాప్టో అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో జిల్లా నూతన కమిటీ చైర్మన్‌గా అప్టా(ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్)జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న సేవలాల్ నాయక్ ను ఎన్నుకున్నారు. అలాగే సెక్రటరీ జనరల్‌గా జి.భాస్కర్ (బి.టీ.ఏ), కో చైర్మన్లుగా వై.నారాయణ(ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం), వి.జి వెంకట్రాములు(డీటీఎఫ్), ఎల్.గులాబీ బాషా(రూట), రాజేష్(ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా యు.రవికుమార్ (యూటీఎఫ్), టి.కె జనార్దన్(ఎస్టీయూ), ఎస్.ఇస్మాయిల్ (ఏపీటీఎఫ్1938), కోశాధికారిగా ఎస్.రంగన్న(ఏపీటీఎఫ్ 257)ఎన్నికయ్యారు. ఎన్నిక కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా, రాష్ట్ర ఫ్యాప్టో కో–చైర్మన్ కాకి ప్రకాష్ రావు వ్యవహరించారు. ఆయా సంఘాల నాయకులు నవీన్ పాటిల్, ఎస్.గోకారి, మరియానందం, తిమ్మప్ప, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దేవనకొండ: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కుంకనూరు గ్రామానికి చెందిన చిన్నతిక్కయ్య(53) కోలుకోలేక బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిఆన వివరాలు.. చిన్న తిమ్మయ్య 18 ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు యాక్సిడెంట్‌లో రెండు కాళ్లు, ఎడమ చేయి విరిగాయి. యేడాది క్రితం జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో తన కుమారుడు మృతిచెందాడు. ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి అప్పులపాలయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 25న పురుగు మందు తాగాడు. భార్య తిరుపతమ్మ గమనించి 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

ముజఫర్ నగర్‌లో చోరీ

కర్నూలు: కల్లూరు మండలం ముజఫర్ నగర్‌లో నివాసముంటున్న వెంకటేశ్వర్లు ఇంట్లో దొంగలు పడి అందినమట్టుకు దండుకుని పరారయ్యారు. వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఈనెల 23న ఇంటికి తాళం వేసి కోవెలకుంట్లకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 4 తులాల బంగారు ఆభరణాలను మూటగట్టుకుని ఉడాయించారు. 24న వెంకటేశ్వర్లు ఇంటికి తిరిగివచ్చేసరికి తలుపులు తెరిచివున్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడివుండటం చూసి చోరీ జరిగిందని నిర్ధారించుకుని నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డీసీసీబీ బోర్డు, జనరల్ బాడీ సమావేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బోర్డు సమావేశం, జనరల్ బాడీ సమావేశం ఈ నెల 27న జరగనుంది. జాయింట్ కలెక్టర్, అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్ బి.నవ్య అధ్యక్షతన గురువారం రెండు సమావేశాలు జరుగనున్నాయి. జనరల్ బాడీ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్‌లందరూ హాజరు కానున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా మొండి బకాయిలను రాబట్టుకునేందుకు స్థిర, చరాస్తులను జప్తు చేసే విషయంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డీసీసీబీ సీఈఓ విజయకుమార్‌తో పాటు డీసీఓ రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

దొంగలకు బామ్మ ఝలక్!

● ఊరెళుతూ నగలన్నీ వెంట తీసుకెళ్లిన వృద్ధురాలు
● ఇంట్లో చోరీకి యత్నించి విఫలమైన దుండగులు


పత్తికొండలోని ఓ ఇంట్లో దొంగలు చిందరవందరగా పడేసిన వస్తుసామగ్రి

పత్తికొండ రూరల్: పట్టణంలోని రెండు ఇళ్లలో దొంగలు చోరీకి యత్నించారు. ఓ ఇంట్లోని బామ్మ తన ఇంట్లోని నగలు ఏమీ ఉంచకపోవడం.. మరో ఇంట్లో కూడా రూపాయి కూడా లభ్యం కాకపోవడంతో దొంగలు చిర్రెత్తి బీరువాలోని వస్తువులను చిందరవందరగా పడేసి ఉడాయించారు. బాధితులు తెలిపిన వివరాలు.. స్థానిక షిరిడీసాయి స్కూల్ సమీపంలో హేమకాంతరెడ్డి ఇల్లు ఉంది. ఇతను వ్యాపార రీత్యా బెంగళూరులో ఉండటంతో వృద్ధురాలైన అతని తల్లి లక్ష్మీదేవి ఒక్కరే ఇంటి వద్ద ఉంటోంది. ఆమె కూడా మంగళవారం గుత్తిలోని బంధువుల ఇంటికి వెళ్తూవెళ్తూ ఇంట్లోని విలువైన ఆభరణాలు, నగదును ఒక సంచిలో వేసుకుని వెంట తీసుకెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండటంతో దొంగలు అర్ధరాత్రి లోపలకు చొరబడ్డారు. ఉడెన్ లాకర్లు, అల్మారా లాక్‌లు పెకిలించి చూసినా చిల్లిగవ్వ దొరకలేదు. చిర్రెత్తి చీరలు, వస్తుసామగ్రిని చిందరవందరగా పడేశారు. ఇత్తడి పూతతో ఉన్న వడ్డాణం, ఇతర ఆభరణాలపై గీసి మరీ పరీక్షించి అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం ఇంటికొచ్చిన వృద్ధురాలికి తాళాలు పగులగొట్టి ఉండటం కనిపించింది. ఇంట్లో ఏమీ చోరీ కాకపోవడంతో వృద్ధురాలిని కుటుంబ సభ్యులు అభినందించారు. ఇదే ఇంటి సమీపంలోని చెరువు పెద్దయ్య ఇంట్లోనూ చోరీకి యత్నించి దొంగలు విఫలమయ్యారు. కాగా సుమారు ఐదుగురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు. పోలీసులు క్లూస్‌టీంతో విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్ మృతి


మంగమూరి గోపాల్ (ఫైల్)

ప్యాపిలి: మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డోన్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్ మంగమూరి గోపాల్ (37) మృతి చెందాడు. డోన్ త్రివర్ణ కాలనీలో నివాసం ఉంటున్న మంగమూరి గోపాల్ మెట్టుపల్లి గ్రామంలో జరిగిన దేవరకు హాజరయ్యాడు. అనంతరం ద్విచక్రవాహనంపై డోన్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. మెట్టుపల్లి శివారు ప్రాంతంలోని సుంకులమ్మ గుడి వద్ద గేదెను తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుధారాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మాజీ మంత్రి సంతాపం

వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్ మంగమూరి గోపాల్ మృతి పట్ల మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగడి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, వలంటీర్ పార్టీ విభాగం అధ్యక్షులు పోస్టు ప్రసాద్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ చూడొద్దని తండ్రి మందలింపు.. కుమారుడి ఆత్మహత్య!


ఆత్మహత్య చేసుకున్న యశ్వాంతాచారి

కర్నూలు: పనికి వెళ్లకుండా నిత్యం సెల్‌ఫోన్‌లో కాలక్షేపం చేస్తున్న కుమారుడిని తండ్రి మందలించడంతో మనస్థాపం చెంది ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కర్నూలులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలివీ.. కల్లూరు మండలం చౌడేశ్వరి వీధిలో నివాసముంటున్న కమ్మరి కృష్ణమోహనాచారి, వసంత దంపతులకు కుమారుడు, కూతురు సంతానం. కృష్ణమోహనాచారి వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య కూలీ పనులకు వెళ్లేది. కుమారుడు యశ్వంతాచారి(21) 8వ తరగతిలోనే చదువు మానేసి వడ్రంగి పనులు నేర్చుకునేవాడు. కొంతకాలంగా ఎప్పుడూ సెల్‌ఫోన్ చూస్తూ పనులకు పోకుండా ఉండటంతో మంగళవారం ఉదయం తండ్రి మందలించాడు. దీంతో కుమారుడు కోపంతో సెల్‌ఫోన్‌ను నేలకేసి పగులకొట్టి పనికి పోకుండా ఇంట్లోనే పడుకున్నాడు. బుధవారం ఉదయం తల్లిదండ్రులు పనికి వెళ్లిన తర్వాత యశ్వంతాచారి ఇంటి హాల్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. తల్లి వసంత ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో అతన్ని కిందకు దించి ఆటోలో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, కేసు కూడా అవసరం లేదని తల్లిదండ్రులు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పోలీసులకు గ'మ్మత్తు' సమాచారం

● ఆటోను దొంగలు తీసుకెళ్లారని చెప్పిన ఆటోవాలా


లోయలో పడిన ఆటోను జేసీబీ సాయంతో బయటకు తీస్తున్న పోలీసులు


ఆటో డ్రైవర్ మనోజ్

కర్నూలు: కర్నూలు–నంద్యాల జాతీయ రహదారిలోని కాల్వబుగ్గ, సోమయాజులపల్లె మధ్య తన ఆటోను దోపిడీ దొంగలు తీసుకెళ్లారని పోలీస్ కమాండ్ కంట్రోల్‌కు ఒక వ్యక్తి ఫోన్‌కాల్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమై ఘటనా ప్రాంతానికెళ్లి చూడగా తప్పుడు సమాచారంగా తేలింది. ఊపిరి పీల్చుకున్న పోలీసులు.. తప్పుడు సమాచారం ఇచ్చిన ఆటోవాలాను మందలించి పంపారు. పోలీసుల విచారణలో తేలిన వివరాలు ఇలా.. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఆటోడ్రైవర్ మనోజ్ జమ్ములమడుగులో వివాహం చేసుకున్నాడు. భార్య గొడవ పడి పుట్టింటికి వెళ్లడంతో ఆమెను తీసుకురావడానికని వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నంద్యాల నుంచి 11 గంటలకు కర్నూలుకు బయలుదేరాడు. ఓర్వకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని కాల్వబుగ్గ వద్ద ఆటో లోయలో పడి డ్రైవర్ మనోజ్ గాయాలకు గురయ్యాడు. మద్యం మత్తులో ఉన్న అతను తన ఆటోను దోపిడీ దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించడంతో అది కమాండ్ కంట్రోల్‌కు చేరింది. దీంతో కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ చెక్‌పోస్టు, కర్నూలు సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులను అప్రమత్తం చేసి తనిఖీ నిర్వహించారు. అర్ధరాత్రి ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ చేరుకుని కాల్వబుగ్గ దగ్గరకు వెళ్లి ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించగా ఆటో లోయలో పడినట్లు గుర్తించారు. మనోజ్‌ను విచారించగా మద్యం మత్తులో ఉన్న తాను ఏమి మాట్లాడానో గుర్తు లేదని, బ్రెయిన్ సరిగా పని చేయడం లేదని తప్పు ఒప్పుకున్నాడు. దీంతో అతనిని పోలీసులు మందలించి కౌన్సెలింగ్ చేసి పంపించారు. లోయలో పడిన ఆటోను జేసీబీ సాయంతో తీయించారు.



ప్రభుత్వ ఐటీఐలో స్వేచ్ఛగా విహరిస్తున్న బాతులు, నెమళ్లు

పక్షి ప్రేమికుడు .. కోదండరాముడు


కుందేలు సంచరిస్తున్న దృశ్యం

డోన్: పశుపక్షాదులతో పాటు ప్రకృతిని ప్రేమించడం కొందరికే సాధ్యం. అలాంటి వారిలో డోన్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో శిక్షకుడిగా (ఇన్‌స్ట్రక్టర్) పనిచేస్తున్న బద్దల కోదండరాముడు ఒకరు. పదేళ్లుగా దాదాపు 70 పక్షులు, జంతువులను ఎంతో అపురూపంగా పెంచుతున్నారు. విద్యార్థులు, సహోద్యోగులతో పాటు ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి సహకారంతో నెమళ్లు, అగ్గికోళ్లు, బాతులు, కుందేళ్లు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.